క్లుప్తంగా

జీపీ కార్మికులకు వేతనం విరాళం



దుగ్గొండి : సమస్యలు పరిష్కరించాలని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె దీక్షలకు నాచినపల్లి సర్పంచ్ పెండ్యాల మమతరాజు గురువారం సంఘీభావం తెలిపి మద్దతు ప్రకటించారు. తన నెల వేతనం రూ.6,500 విరాళంగా అందించారు. కార్మికులు గాదం రాజాలు, పొన్నం రమేష్, పుట్టపాక రాజేందర్, ముస్కు రాజు, సదయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



నల్లబెల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా మాట్లాడారు.

విధుల్లో చేరాలి..

మూడు రోజులుగా మండలంలో అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తే అవకాశముందని కార్మికులు సమ్మె తాత్కాలికంగా విరమించి విధుల్లో చేరాలని మండల పంచాయతీ అధికారి కూచన ప్రకాశ్ కోరారు. సమ్మెలో ఆ సంఘం మండల ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ల వెంకటేశ్వర్లు, నాయకులు దుర్గనాల రాజు కుమార్, ఆసం రవి, గుగులోత్ రాజు, జాటోత్ సాంబయ్య, కూచన కిషన్, సాద వెంకటస్వామి, పులి చక్రపాణి, గడ్డమీది తరుణ్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు బాధితుల తరలింపు



నర్సంపేట : నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాధన్నపేట చెరువు మత్తడి పడడంతో పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండడంతో గురువారం మున్సిపల్, పోలీసు అధికారులు కాలనీ వాసులను పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. భారీ వర్షాలకు పట్టణంలోని పలు కాలనీల్లో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

బాధితులకు సాయం



టార్పాలిన్ అందజేస్తున్న విజయ్‌చందర్ రెడ్డి

గీసుకొండ : మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన కుటుంబాలకు పలువురు గురువారం సాయం చేశారు. బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి దళిత, బీసీ కుటుంబాల వారికి సొంత ఖర్చుతో టార్పాలిన్లు అందించారు. అలాగే గీసుకొండకు చెందిన మేకల ఐలమ్మకు మన ఆపద్బాంధువుల ఫౌండేషన్ ప్రతినిధి కర్ణకంటి రాంమూర్తి బియ్యం,14 రకాల నిత్యావసరాలు అందించి ఆదుకున్నారు.

గీసుకొండ ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

గీసుకొండ : గీసుకొండ కాంగ్రెస్ ఎంపీపీ బీమగాని సౌజన్యపై ప్రకటించిన అవిశ్వాస తీర్మానంపై హైకోర్టు స్టే విధించింది. ఈ నెల 5న కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, బీఆర్‌ఎస్‌కు చెందిన ముగ్గురు ఎంపీటీసీలు మొత్తం ఐదుగురు ఎంపీపీపై అవిశ్వాస నోటీసును వరంగల్ ఆర్డీఓకు అందజేశారు. కాగా ఈ నెల 7న ఆర్డీఓ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 31న అవిశ్వాస తీర్మానంపై చర్చించేందుకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టిన ఎంపీటీసీలు 22 రోజులుగా క్యాంపులో రహస్యంగా ఉంటున్నారు. కాగా తనకు వ్యతిరేకంగా ఎంపీటీసీలు ఇచ్చిన నోటీసు సరిగా లేదని ఎంపీపీ సౌజన్య హైకోర్టును ఆశ్రయించగా ఐదుగురు ఎంపీటీసీల తీర్మానం(నోటీసు) చెల్లదంటూ రెండు రోజుల క్రితం స్టే విధించింది. గురువారం హైకోర్టు జారీ చేసిన స్టే ఉత్తర్వులను ఎంపీపీ సౌజన్య ఆర్డీఓ కార్యాలయ అధికారులకు అందించారు. దీంతో క్యాంపునకు తరలివెళ్లిన ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఈ విషయమై ఏం చేయాలనే విషయంలో పునరాలోచనలో పడ్డారు.

రాయపర్తి: సన్నూరులో రహదారిపై ప్రవహిస్తున్న వరద



వర్ధన్నపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న ఆకేరు వాగు



దుగ్గొండి: వరదనీటిని పరిశీలిస్తున్న ఎస్సై పరమేష్, సిబ్బంది



నర్సంపేట రూరల్: ఉధృతంగా ప్రవహిస్తున్న మాధన్నపేట కాజ్‌వే



వర్ష బీభత్సం

అల్పపీడన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షం బీభత్సం సృష్టించింది. చెరువులు, కుంటల్లో వరద ప్రవాహం ముంచేసింది. అనేక రోడ్లు ధ్వంసమయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. అధికారులు, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి, రోడ్లు మూసి పహారా కాస్తున్నారు.

\- సాక్షి నెట్‌వర్క్



ఖానాపురం: తుంగబంధంకు గండి..



చెన్నారావుపేట: ఉధృతంగా ప్రవహిస్తున్న వట్టి వాగు



వర్ధన్నపేట: మృతిచెందిన ఎద్దు వద్ద యాకయ్య



నల్లబెల్లి: పరిశీలిస్తున్న తహసీల్దార్, స్థానికులు



నర్సంపేట రూరల్: కూలిన కొమురమ్మ ఇల్లు



సంగెం: ఆశాలపల్లి వద్ద రోడ్డుకు అడ్డంగా వృక్షం



సంగెం: వెంకటపూర్ చెరువు



పర్వతగిరి: కూలిన విద్యుత్ స్తంభం



నల్లబెల్లి: ఊరచెరువుకు గండి



చెన్నారావుపేట: ఉధృతంగా మున్నేరు వాగు



పర్వతగిరి: ట్రాన్స్‌ఫార్మర్ వైర్లపై కూలిన చెట్టు



సంగెం: ఉధృతంగా ఎల్లుగూర్‌రంగంపేట చెరువు..



చెన్నారావుపేట: కోపాకుల చెరువు మత్తడి..



చెన్నారావుపేట: లోలెవెల్ కాజ్‌వేపై వరదనీరు



సంగెం: వెంకటాపూర్‌లోని పత్తి చేనులో వరద



చెన్నారావుపేట: కూలిన ఇంటిగోడ వద్ద లావణ్య



వర్ధన్నపేట: రోడ్డుపై పడిన చెట్టు



గీసుకొండ: కొట్టుకుపోయిన బీటీ రోడ్డు



రాయపర్తి: ధ్వంసమైన ఊకల్-కొండాపురం రోడ్డు



వర్ధన్నపేట: గండి పడిన వర్ధన్నపేట చెక్ డ్యాం



ఖానాపురం: ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు



వర్ధన్నపేట: కోనారెడ్డి చెరువు మత్తడి రాళ్లు తొలగింపు..



నర్సంపేట: అయ్యప్ప దేవాలయం సమీపంలోని వాగు



రాయపర్తి: కొలన్‌పల్లిలో కూలిన ఇంటి వద్ద భాస్కర్

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

నర్సంపేట : వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన నానబోయిన కోమలకు మంజూరైన రూ.1.50లక్షల విలువైన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకం కింద వర్తించని అనేక రోగాలకు సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసీ ద్వారా వైద్యం చేయించుకోవచ్చన్నారు.

మాదన్నపేట చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని మాదన్నపేట చెరువు నిండుకుండలా మారి ఉధృతంగా మత్తడి పోస్తోంది. అంతేకాకుండా గాలులకు అతిపెద్ద వృక్షం మైసమ్మ గుడి వద్ద కూలిపోవడంతో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, తహసీల్దార్ రామ్మూర్తి, టౌన్ సీఐ పులి రమేష్‌గౌడ్ పరిశీలించారు. కట్టకు ఏమైనా ప్రమాదం పొంచి ఉందా అని ఆరా తీశారు. అదేవిధంగా ముగ్ధంపురం గ్రామ శివారులోని బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. అనంతరం రాజుపేట గ్రామంలో చెన్నారావుపేట ప్రాథమిక సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన గోదాంను ప్రారంభించారు.



మాదన్నపేట చెరువు కట్టపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

వరద ప్రాంతాలకు ప్రజలు వెళ్లొద్దు



ఖానాపురం : అశోక్‌నగర్‌లో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ డీసీపీ మురళీధర్



చెన్నారావుపేట: వాగు వద్ద చేపలు పట్టకుండా హెచ్చరిక చేస్తున్న ఎస్సై మహేందర్

ఖానాపురం : వరద ఉధృతి అధికంగా ఉన్న ప్రాంతాకు ప్రజలు వెళ్లొద్దని ఈస్ట్‌జోన్ ఇన్‌చార్జి డీసీపీ దాసరి మురళీధర్ సూచించారు. ఈ మేరకు మండలంలోని పాకాల మత్తడి, అశోక్‌నగర్ శివారులో రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న వరద ఉధృతిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వరద ప్రాంతాల వద్ద సిబ్బందిని ఏర్పాటు నియమించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తడి ప్రదేశంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మత్తడిలోనికి పర్యాటకులను వెళ్లనీయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఆయన వెంట ఏసీపీ తిరుమల్, సీఐలు సూర్యప్రసాద్, పులి రమేష్, ఎస్సై తిరుపతి ఉన్నారు.

ప్రజలు బయటికి రావొద్దు

చెన్నారావుపేట : విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావొద్దని ఎస్సై తోట మహేందర్ సూచించారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. చెరువులు నిండి మత్తళ్లు పోస్తున్నాయని, చెరువు కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఎలాంటి ప్రమాదాలు సంభవించిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వరదల వద్ద చేపల వేటకు వెళ్లకూడదన్నారు. రోడ్లపై నీరు నిలిచి గుంతలు ఏర్పడకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

రైతుల సమగ్రాభివృద్ధే ధ్యేయం

ఆత్మకూరు : రైతుల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అక్కంపేటలోని ఎరువుల దుకాణంలో రైతులతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో ఎరువులు అందించేలా కిసాన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. కిసాన్ సేవా కేంద్రాల ఏర్పాటును ప్రధాని మోదీ రాజస్థాన్‌లో ప్రారంభించారని తెలిపారు. కిసాన్ సేవా కేంద్రం ద్వారా భూసార పరీక్షలు సైతం నిర్వహిస్తారని వివరించారు. మండలంలోని రైతులందరూ కిసాన్ సేవా కేంద్రాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లుగూర్‌రంగంపేట చెరువు కట్టకు బుంగ



చెరువు కట్టకు బుంగ పడిన చోట మొరం పోయిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై భరత్, స్థానికులు



చెరువు కట్టకు పడిన బుంగ

- స్పందించిన ఎస్సై భరత్
- ప్రమాదం జరగకుండా మరమ్మతులు
- పరిశీలించిన ఎమ్మెల్యే చల్లా, డీసీపీ మురళీధర్
- ముందే హెచ్చరించిన 'సాక్షి'

సంగెం: మండలంలోని ఎల్లుగూర్‌రంగంపేట చెరువు కట్టకు బుంగ పడింది. వెంటనే స్పందించిన ఎస్సై భరత్ స్థానికులతో కలిసి పొక్లెయినర్, 10 మొరం ట్రాక్టర్లను తెప్పించి, గురువారం మరమ్మతులు చేపట్టడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. 'కోతకు గురైన ఎల్లుగూర్‌రంగంపేట చెరువు కట్ట' శీర్షికన మే 2న 'సాక్షి' ప్రత్యేక కథనం ప్రచురించింది. తిరిగి జూన్ 28న 'తెగితేనే పట్టించుకుంటారా' శీర్షికన మరో కథనం ప్రచురితమైంది. దీంతో ఐబీ అధికారులు రెండు ట్రాక్టర్ల మొరం పోయించి పని అయిపోయిందని చేతులు దులుపుకున్నారు.

'సాక్షి' చెప్పిన చోటే మళ్లీ బుంగ..

ఎడతెరిపి లేని భారీ వర్షాలతో కట్టకు 'సాక్షి' చెప్పిన ప్రాంతంలోనే మళ్లీ బుంగపడింది. చెరువు కట్టకు ప్రమాదం ఉందని మత్స్యకారులు, రైతులు, స్థానికులు, సాక్షి హెచ్చరించినప్పుడు మరమ్మతులు చేపడితే ఇప్పుడు ప్రమాదం ఏర్పడి ఉండేది కాదని ఐబీ అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక వేళ చెరువు కట్ట తెగితే సంగెం మండలంలోని బీకోజీనాయక్ తండా, తూర్పు తండాతో పాటుగా నెక్కొండ మండలంలోని ముదిగొండ, సీతారాంపురం, బంజరపల్లి, చంద్రుగొండ, నెక్కొండ తదితర 15 గ్రామాలు నీటమునిగేవి.

చెరువు కట్టను సందర్శించిన ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ఈస్ట్‌జోన్ డీసీపీ

ఎల్లుగూర్‌రంగంపేట చెరువు కట్టకు ప్రమాదం పొంచి ఉందని విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హుటాహుటిన హైదరాబాద్ నుంచి నేరుగా గురువారం చెరువును సందర్శించారు. ప్రమాదం ఏర్పడిన చోట చేపట్టిన మరమ్మతులను తెలుసుకున్నారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందున్న మత్తడిని ముమ్మడివరం వైపు కొంత మేరకు తొలగించారు. ఎల్లుగూర్‌రంగంపేట వైపున మత్తడి పక్కన ఉన్న కట్టను పొక్లెయినర్ ద్వారా గండి పెట్టించి చెరువు కట్టకు ప్రమాదం లేకుండా దగ్గరుండి చూసుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, ఈస్ట్ జోన్ డీసీపీ దాసరి మురళీధర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ శ్రీనివాస్, సంగెం ఎస్సై భరత్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, జెడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ బానోత్ పద్మ శ్రీనివాస్, నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాస్, అశోక్ తదితరులు ఉన్నారు.



ప్రమాదం ఉందని 'సాక్షి'లో వచ్చిన కథనాలు

ముంపు ప్రాంతాల్లో పరిశీలన



పరిశీలిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

పర్వతగిరి : మండలంలోని వివిధ గ్రామాలల్లో వరద ప్రభావిత ప్రాంతాలను తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ చక్రాల సంతోష్‌కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించి పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పాక శ్రీనివాస్, సర్పంచ్ చింతపట్ల మాలతి, ఎంపీటీసీ రాజు పాల్గొన్నారు. అలాగే పర్వతగిరి రిజర్వాయర్‌లోకి చుట్టు పక్కల ప్రాంతాలలోని వరద నీరు భారీ స్థాయిలో చేరుకోవడంతో గండి పడే ప్రమాదం ఏర్పడింది. దీంతో పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు గురువారం ఉదయం 5గంటల ప్రాంతంలో సిబ్బంది, స్థానికులతో కలిసి తక్షణ చర్యలకు రిజర్వాయర్ నుండి నీరు బయటకు వెళ్లే మార్గాన్ని సుగమం చేశారు. ఈ సందర్భంగా పర్వతగిరి ఎస్సై కృషికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ వరంగల్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌కు మెసేజ్ చేశారు.

మిత్రుల చేయూత

ఐనవోలు : మండలంలోని గర్మిళ్లపెల్లి గ్రామానికి చెందని రాజారపు రాజ్‌కుమార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి బాల్యమిత్రులు చేయూత అందించారు. తొలుత రాజ్‌కుమార్‌తో కలిసి 7, 8 తరగతులు చదువుకున్న మిత్రులు అతడి కుటుంబాన్ని పరామర్శించారు. రాజ్‌కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.